సర్కారు బడుల్లో అభివృద్ధి సవ్వడి


నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసిన చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


అధునాతన హంగులతో ఉన్న చింతపర్రు ప్రాథమిక పాఠశాల


విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు నిర్మించిన షెడ్డు

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు
- కోట్లాది రూపాయలతో అభివృద్ధి

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి సవ్వడి చేస్తుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు-నేడు పథకంలో భాగంగా చేసిన పాఠశాలల అభివృద్ధి ఔరా..! అని అనిపిస్తుంది. పాలకొల్లు నియోజకవర్గంలో ఫేజ్-1, ఫేజ్-2 లో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి. కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. సుమారు రూ.51 కోట్లు పైగా వ్యయంతో నియోజకవర్గంలోని పాఠశాలలకు సరికొత్త రూపును తీసుకొచ్చారు. యలమంచిలి మండలంలో ఫేజ్-1లో 27 పాఠశాలలను రూ.4,52,85,000లతో అభివృద్ధి చేశారు. అలాగే పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలంలో 35 పాఠశాలలను రూ.8,80,70,000లతో అభివృద్ధి చేశారు. అలాగే పోడూరు మండలంలో 19 పాఠశాలలను రూ.3,75,47,000లతో విద్యార్థులకు అదనపు వసతులు కల్పించారు. ఫేజ్ 2లో యలమంచిలి మండలంలో 30 పాఠశాలల్లో రూ.10,10,45,000లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాలకొల్లు మండలంలో 30 పాఠశాలలను రూ.9.97 కోట్లతోనూ, పాలకొల్లు పట్టణంలో 17 పాఠశాలలను రూ.4,18,61,000, పోడూరు మండలంలో 42 పాఠశాలలను రూ.12, 48,89,000లతో అభివృద్ధి చేస్తున్నారు. ఫేజ్ 2లో చేపట్టిన పాఠశాలలు సుమారు 80 శాతం పైగా పనులు పూర్తయినట్లు నాడు - నేడు అసిస్టెంట్ ఇంజనీర్ వర్ధనపు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఫేజ్-2లో 12 రకాల అభివృద్ధి పనులు

ఫేజ్-2లో పాఠశాలల్లో 12 రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో అదనపు తరగతి గదులు, ప్రహరీ, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, గ్రీన్ చాక్ బోర్డులు, పాఠశాలకు సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, మరుగుదొడ్ల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యం, మంచినీరు, పెయింటింగ్స్, గ్రానైట్‌తో ఫ్లోరింగ్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలోనూ 4 ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు.

పాఠశాలకు అదనపు హంగులు



నేను పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. మా పాఠశాలలో సుమారు రూ.91 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాల రూపు రేఖలు మారిపోయాయి. నేను 5వ తరగతి వరకు పూలపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో చదివాను. ఫ్లోరింగ్ శిథిలమైపోయి ఉండేది. ప్రస్తుతం ఆ పాఠశాలను చూస్తుంటే ఆనందం కలుగుతోంది.

– పి.వర్షిత, విద్యార్థిని

ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు



జగన్ మావయ్య విద్యకు ప్రాధాన్యత ఇచ్చారు. మా పాఠశాలను తక్కువ సమయంలోనే అభివృద్ధి చేశారు. మా తరగతి గదులు ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. కూర్చోవడానికి అనుకూలంగా బెంచీలు ఏర్పాటు చేశారు. ఇంగ్లిషు ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆంగ్ల భాషలో మంచి ప్రావీణ్యం సాధించాను.

– జి.తేజస్వి, విద్యార్థిని, చింతపర్రు

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

మొగల్తూరు: మండలంలోని పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. శనివారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల ద్వారా 896 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 858 మంది విద్యార్థులు హాజరయ్యారు. 38 విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ శామ్యూల్ జాన్ తెలిపారు.

రహదారి పరిశీలన


పెనుగొండ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ రహదారి పరిశీలిస్తున్న ఆర్డీఓ అంబరీష్

పెనుగొండ: పెనుగొండ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ రహదారి సమస్యను నరసాపురం ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ శనివారం పరిశీలించారు. ఓఎన్‌జీసీ పెనుగొండలో నిర్మించిన బైపాస్ రహదారిలో గతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అయితే ఓఎన్‌జీసీ రహదారికి అగ్రిమెంట్ పూర్తి కావడంతో బైపాస్ రహదారి స్థలాలను వదలివేశారు. దీంతో స్థల యజమానులు రహదారిపై నిర్మాణాలు చేపట్టడంతో సబ్ స్టేషన్‌కు రాకపోకలుకు అడ్డంకి ఏర్పడింది. దీంతో రహదారి ఏర్పాటుకు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు ఆర్‌వీవీ రోహిణీ దేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై ఆకస్మిక తనిఖీ


ఆచంటలో స్ట్రాంగ్ రూం పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో ఆచంటలోని జూనియర్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ గాంధీ పరిశీలించారు. శనివారం ఆచంట తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ముప్పన వీర రాఘవయ్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ అతిక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి స్వామి నాయుడు , తహసీల్దారు ఐవీ శెట్టి తదితరులు పాల్గొన్నారు. అయితే భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని జర్నలిస్టుల జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు ఆచంటలో జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ గాంధీకి జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఆచంట నియోజకవర్గంలోని కొడమంచిలిలోని 86 నుంచి 90 వరకూ ఉన్న పోలింగ్ బూత్‌లను నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామి నాయుడు పరిశీలించారు. శనివారం కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ఎం.రామ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలామృతంతో చిన్నారులకు పౌష్టికాహారం


బొల్లేటిగుంట పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోడూరు: బాలామృతంతో చిన్నారులకు పోషక విలువలు సమృద్ధిగా అందుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగపద్మ అన్నారు. బొల్లేటిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆధ్వర్యంలో 'పోషణ్ పక్వాడ్' ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల్లో కూడా పోషక పదార్థాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. అనంతరం 'వెల్ బేబీ షో' కార్యక్రమం, చిన్నారుల తల్లిదండ్రులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.పద్మావతి, కె.బేబి, ఎం.మహలక్ష్మి, జె.ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార వారోత్సవాల ముగింపు

పాలకొల్లు అర్బన్: చిరుధాన్యాల ప్రాధాన్యతపై పిల్లల తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. మండలంలోని అరట్లకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. కేంద్రంలో చిన్నారులకు వెల్ బేబీ షో నిర్వహించారు. అలాగే తల్లులకు పోషకాహార ప్రాధాన్యతపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రూప, భానుశ్రీ, అంగన్‌వాడీ వర్కర్లు కె సత్యవతి, బి లీలాకుమారి, కేవీ సుజాత, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆగర్రులో

ఆగర్రు శివారు చిట్టివానిగరువులో పోషకాహార వారోత్సవాల ముగింపు వేడుకలు సూపర్‌వైజర్ ఎస్.మంగ నిర్వహించారు. చిన్నారులకు వెల్ బేబీ షో నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా పోలీసు షేక్ మీరా అహ్మదున్నీసా, అంగన్‌వాడీ వర్కర్లు పి.దుర్గాభవాని, సీహెచ్ బేబీ కుమారి పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి


క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: క్రమం తప్పకుండా మందులు వాడి, పౌష్టికాహారం తీసుకుంటే క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా క్షయవ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేసి మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గుతో పాటు తెమడ పడడం, ఆకలి మందగించడం, రాత్రి సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గడం తదితర లక్షణాలుంటే ఆర్‌టీపీసీ ద్వారా తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలకు ఉచితంగా మందులు అందజేస్తామని, దీంతో పాటు నెలకు రూ.500 పోషకాహారం నిమిత్తం అందజేస్తామన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీలోని ఆర్‌టీపీసీ ట్రీట్‌మెంట్ యూనిట్‌లో 57 కేసులు నమోదైనట్లు చెప్పారు. వీటిలో ఊపిరితిత్తులకు సంబంధించి 48 కేసులు నమోదైనట్లు వివరించారు. వీరిలో 14 మంది వ్యాధి నుంచి కోలుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ జి.ఉదయ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చు పెడుతున్న టీడీపీ


కరుగోరుమిల్లిలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న మహిళలు

పెనుగొండ: తెలుగుదేశం పార్టీ నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. కరుగోరుమిల్లిలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మహిళలు ఘనంగా సత్కరించారు. ఐదేళ్లుగా ఆచంట నియోజకవర్గంలో ప్రజలు కులాల సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఉన్నారన్నారు. గత పాలనలో కులాల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకునేవారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో కులాలను సమన్వయం చేసుకొంటూ అందరికీ న్యాయం చేస్తూ ముందుకు సాగుతుంటే, ఎన్నికల నేపథ్యంలో కులాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కరుగోరుమిల్లి ఇన్‌చార్జి ముత్యాల నాగేశ్వరరావు, కొక్కిరి రాంబాబు, ముత్యాల జగ్గారావు, కాయల సత్యనారాయణ, పిల్లి దుర్గా ప్రసాద్, పెచ్చెట్టి శ్రీను పాల్గొన్నారు.

ఘన స్వాగతం

కరుగోరుమిల్లిలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు ఘన స్వాగతం లభించింది. శనివారం గ్రామ నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు వందలాదిగా తరలివచ్చి ర్యాలీగా గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

వైభవంగా వైద్యనాథేశ్వర స్వామి రథోత్సవం


పెనుమర్రు గ్రామంలో శ్రీ ఉమా వైద్యనాథేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని పెనుమర్రు గ్రామంలో ఉన్న శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం దేవేరుల రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి తిరిగి శివాలయానికి చేరుకుంది. ఆలయ నిర్మాత పొత్తూరి సోమరాజు ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, సాయంత్రం సదస్యం, పండిత సత్కారం , రాత్రి తాడేపల్లిగూడెంనికి చెందిన రాము గురువు ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు అవగాహన


ఆచంటలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో మాట్లాడుతున్న దృశ్యం

పెనుగొండ: ఎన్నికలకు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు ప్రింట్ చేసినపుడు వాటిపై తప్పనిసరిగా వివరాలు ప్రింట్ చేయాలని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏపీ పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టరు వి.స్వామి నాయుడు తెలిపారు. శనివారం ఆచంటలో జరిగిన సమావేశంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ప్రాతినిథ్య చట్టం 1951, సెక్షన్ 127-ఏ అనుసరించి కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లపై ప్రింటర్ పేరు, పబ్లిషర్ పేరు, తప్పనిసరిగా ఉండాలని, ప్రింట్ చేసిన మూడు రోజుల లోపు ఎన్నికల అధికారికి వాటి వివరాలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు కాకుల బాబ్జీ, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అధికారి ఎం.కుమారి, ఎలెక్షన్ డిప్యూటీ తహసీల్దారు ఎం.రామ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ అని మోసం చేశారు


తూర్పుపాలెంలో రంగన్న సైనికులం అంటూ నినాదాలు చేస్తున్న దొంగరావి పాలెం మత్స్యకారులు

పెనుగొండ: అవకాశవాది మాటలకు మోసపోయామని, మాయమాటలు చెప్పి మర్యాదపూర్వక భేటీ అంటూ తీసుకువెళ్లి టీడీపీలో చేరినట్లు ప్రకటించుకోవడంపై దొంగరావిపాలెం మత్స్యకార సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తూర్పుపాలెంలోని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును ఆయన కార్యాలయంలో కలిసి జరిగిన మోసాన్ని వివరించారు. ముమ్మాటికి రంగన్న సైనికులమే అంటూ నినాదాలు చేశారు. 15 ఏళ్ల ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లు సైతం తీయించలేకపోయారని, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసి సమస్యను వివరించగానే విద్యుత్ వైర్లు సరి చేయించి మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. అంతేగాకుండా కొంత సొంత ఖర్చుతో ముందుగా మత్స్యకార కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. అటువంటి శ్రీరంగనాథరాజుకు విశ్వాసంగా వెంట ఉంటామని తెలిపారు.

గ్రామాల్లో ప్రచార సందడి


మొగల్తూరు: పేరుపాలెం సౌత్‌లో మోకావారిపాలెంలో పర్యటిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు


పోడూరు: వద్దిపర్రులో అవ్వ పాదాలకు నమస్కరిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు


పెనుగొండ: కరుగోరుమిల్లిలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను వివరిస్తూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ప్రచారంలో జత కలుస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఆచంట నియోజకవర్గంలోని ఆచంట మండలం కందరవల్లి, కరుగోరుమిల్లిల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు నియోజకవర్గంలో పోడూరు మండలం వద్దిపర్రులో పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు ప్రచారం నిర్వహించారు. తమను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. – సాక్షి నెట్‌వర్క్


మొగల్తూరు: పేరుపాలెం సౌత్‌లో ఓ అవ్వకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు


పెనుగొండ: కందరవల్లిలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

క్లుప్తంగా

గ్రామాల్లో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోడూరు: ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని పాలకొల్లు రూరల్ సీఐ కె.సతీష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని తూర్పుపాలెం, పండితవిల్లూరు, జగన్నాథపురం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలసి పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయని ప్రజలకు భరోసా కల్పించే లక్ష్యంతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలంతా ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై డి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

పూలపల్లి జెడ్పీ స్కూల్‌కి 50 ప్లాంక్ కుర్చీల బహూకరణ

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతల ప్రోత్సాహం కూడా అందించాలని పూలపల్లి సంధ్యా మెరైన్స్ అధినేత కె.ఆనంద్ అన్నారు. పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విలువైన 50 ప్లాంక్ ఐరన్ కుర్చీలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి ర్యాంకులు సాధించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు, ప్లాంట్ మేనేజర్ యతిరాజు, సీనియర్ అకౌంటెంట్ రాంబాబు, ఇన్‌చార్జ్ హెచ్ఎం శర్మ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ తొలి పూజకు ఆహ్వానం


ముహూర్త పత్రికను పుట్టింటి వంశపారంపర్య ధర్మకర్తకు అందజేస్తున్న మెట్టినింటి ధర్మకర్తలు

యలమంచిలి: అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి ఉగాది ఉత్సవాలకు తొలి పూజ ముహూర్త పత్రికను ఆలయ పుట్టింటి వంశపారంపర్య ధర్మకర్త అడబాల రాజేష్‌కు శనివారం ఆలయ మెట్టినింటి వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాస్ అందజేశారు. ఆలయ అర్చకులు ఆగమ ప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు ఈ నెల 27న తొలి పూజ నిర్వహించి అమ్మవారిని పుట్టింటికి తీసుకువెళ్లడానికి ముహూర్తం నిర్ణయించారు. ముహూర్త పత్రికకు ఆలయ క్షేత్రపాలకుడు కొంతేరు శ్రీ కుంతీ నరసింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం ఆలయ వంశపారంపర్య ధర్మకర్తకు అందజేశారు. ఈ నెల 27న ప్రారంభమయ్యే ఉగాది ఉత్సవాలు ఉగాది వరకు 15 రోజుల పాటు జరుగుతాయని ధర్మకర్తలు తెలిపారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం పవిత్ర వశిష్ట గోదావరి తీరాన కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అనంతరం భక్తులు ఆలయ వద్ద ఉన్న ధ్వజస్తంభానికి పూజలు దీపోత్సవాలు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనాలు అనంతరం ఆలయ ఆవరణలో వెలవలపల్లి వెంకట సాయి కృష్ణ ఆధ్వర్యంలో పదివేల మంది భక్తులకు అన్న ప్రసాదం స్వీకరించారు. వంగూరి భాస్కర్, తురగా చంద్రశేఖర్, కసుగుర్తి వెంకట రామన్న, మానేపల్లి కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువు పరిశీలన


మంచినీటి చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ మున్సిపల్ వాటర్ వర్క్స్ కార్యాలయాన్ని పరిశీలించారు. నీటి నిల్వలు ఎంత వరకూ ఉన్నాయనే అంశాన్ని ఆరా తీశారు. మంచినీటి చెరువులో నీటిమట్టాన్ని పరిశీలించారు. కాలువలు కట్టే సమయానికి చెరువును పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. వేసవిలో రెండు పూటలా శుభ్రమైన నీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ సునీల్ తదితరులు ఉన్నారు.